క్లుప్తంగా

నూతన పైపులైన్లు ఏర్పాటు చేయాలి

మంగళగిరి: నగర పరిధిలో తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా పైపులు మరమ్మతులకు గురైన చోట్ల నూతన పైపులైన్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) సూచించారు. నగరంలో తాగునీటి సరఫరా చేసే పైపులైన్లు మరమ్మతులకు గురి కాగా అధికారులతో కలసి ఆయా ప్రాంతాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ తాగునీటి సరఫరాల ప్రజలకు ఇబ్బంది లేకుండా తక్షణం పరిష్కంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్ పాల్గొన్నారు.

సంస్కృతి సంప్రదాయాలను నేటి తరానికి అందించాలి

తాడేపల్లిరూరల్: భారతీయ సంస్కృతి సంప్రదాయాలను నేటి తరానికి అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని హార్నిక్స్ రీజెన్సీ ప్రైవేటు లిమిటెడ్ డైరెక్టర్ రాజేశ్వరి అన్నారు. ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలోని గోశాలలో గర్భం దాల్చిన ఒక ఆవుకు (పుంగనూరు జాతి) సీమంత కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వర్సిటీలోని గోశాల, ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం సారథ్యంలో గోశాలలో దేశీయ జాతులు, గిర్, కపిల, ఒంగోలు ఆవులతో సహా మొత్తం 26 ఆవులను కేఎల్‌యూ సంరక్షిస్తోందని తెలిపారు. వర్సిటీ వైఎస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం డీన్ డాక్టర్ వి.రాజేష్, అసోసియేట్ డీన్ కె.జె.బ్రహ్మచారి, డాక్టర్ జి.ఆర్.కె.ప్రసాద్, డాక్టర్ కె.వి.ఎస్.ఆర్.జి.రామారావు, హార్టికల్చర్ మేనేజర్ లోకేష్‌రెడ్డి, మెస్ ఇన్‌చార్జి పర్చూరి వేణు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సహాయం

తాడేపల్లిరూరల్: మిచాంగ్ తుఫాన్ కారణంగా ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి పట్టణ పరిధిలోని డోలాస్‌నగర్, బాపనయ్య పేటకు చెందిన ఓ వ్యక్తి ఇంటిపై చెట్టుపడి ఇళ్లు కోల్పోవడంతో బుధవారం స్థానిక నాయకుల ద్వారా సమాచారం అందుకున్న వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్‌రాజు బాధిత కుటుంబానికి ఆ సహాయాన్ని అందజేశారు. బాపనయ్య పేటకు చెంది కంభంపాటి దానియేలుకు రూ.10 వేలు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సేవాదళ్ నాయకులు రమేష్ పాల్గొన్నారు.

మోతడకలో ఫారం-7 అర్జీలు నిష్పక్షపాతంగా పరిశీలించాలి

తాడికొండ: మోతడక గ్రామంలో ఓటర్ల జాబితాలో బీఎల్‌వోలు, అధికారుల నుంచి వచ్చిన ఫారం-7 అర్జీలను నిష్పక్షపాతంగా పరిశీలించాలని వైఎస్సార్ సీపీ మోతడక నాయకులు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.రవీంద్ర రావును కోరారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటయ్య మాస్టారు, వాడకొప్పుల రాజు, సంసోన్, సంకూరు జయపాల్, నిమ్మగడ్డ ప్రసాద్, చాగంటి కోటేశ్వరరావు ఉన్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

మంగళగిరి: పట్టణంలోని గండాలయ పేటకు చెందిన ఆనంద్‌బాబు కనిపించడం లేదని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు బుధవారం తెలిపారు. వివరాలు.. ఆనంద్, మెయిన్‌బజార్‌లోని వస్త్రదుకాణంలో పనిచేస్తున్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు అధ్వానంగా ఉండడం, కుమార్తెకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో మనస్తాపంతో మెసేజ్ పెట్టి వెళ్లిపోయాడు. ఆచూకి కొరకు ఎంత వెతికినా కనిపించకపోవడంతో భార్య మీనాక్షి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

క్రీడా సామగ్రి అందజేత

ఫిరంగిపురం: ఆటలు ఆడటం ద్వారానే శారీరకంగా ఆరోగ్యం చేకూరుతుందని ఎంపీపీ షేక్ షహేలానర్గీస్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా పంచాయతీల కార్యదర్శులకు క్రీడా సామగ్రిని అందజేశారు.కార్యక్రమంలో ఎంపీడీఓ విలియమ్స్ పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించారంటూ పోలీసులకు ఫిర్యాదు

మేడికొండూరు: కులం పేరుతో ఓ కళాశాల నిర్వాహకులు దూషించారని ఆరోపిస్తూ పోలీసులను ఆశ్రయించిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. సిరిపురం గ్రామానికి చెందిన లాం కోటమ్మ నాగరాజుకు ఇద్దరు పిల్లలు. కూలి పనులు చేసుకుంటూ ఇద్దరు పిల్లలను చదివించుకుంటున్నారు. పెద్ద కుమారుడు ప్రసన్న కుమార్, మూడు సంవత్సరాల క్రితం కళాశాలలో ఫీజు చెల్లించి చేర్పించాడు. నవంబరు 10న విద్యార్థి ప్రసన్నకుమార్ డిటైన్డ్ లిస్టులో వచ్చాడని చెప్పారు. కళాశాలకు సక్రమంగా రావడం లేదని కళాశాల హెచ్‌ఓడీ విద్యార్థి తల్లిదండ్రులను కళాశాలకు పిలిపించారు. ప్రసన్న కుమార్ హాజరు శాతం తక్కువగా ఉన్నందున డిటైన్డ్ చేస్తున్నట్లు చెప్పారు. ఈవిషయంపై విద్యార్థి తల్లిదండ్రులకు కళాశాల హెచ్‌ఓడీ మధ్య గొడవ చోటుచేసుకుంది. ఈవిషయంపై తనను కులం పేరుతో దూషించారంటూ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితుల ఫిర్యాదుపై కళాశాల ప్రిన్సిపాల్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ డేవిడ్‌రాజు తెలిపారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

- ఎమ్మెల్యే ఆర్కే
- పంట పొలాల పరిశీలన



గుండిమెడ అరటి తోట వద్ద రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు

తాడేపల్లిరూరల్: మిచాంగ్ తుఫాన్ కారణంగా రైతులకు అపార నష్టం జరిగిందని, రైతులకు జరిగిన నష్టం గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వారికి మెరుగైన నష్టపరిహారం అందించేందుకు కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి హామీ ఇచ్చారు. నగరపాలక సంస్థ పరిధిలోని గుండిమెడ, నూతక్కి ప్రాంతాల్లో ఉన్న వాణిజ్య, వరి పంట పొలాలను ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, వైఎస్సార్ సీపీ తాడేపల్లి రూరల్ కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డితో బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ సోమ, మంగళవారాల్లో తుఫాన్ ప్రభావం మంగళగిరి నియోజకవర్గంపై బాగా ఉందని 150 మి.మీ. వర్షపాతం నమోదైందని, సోమవారం కురిసిన వర్షం వల్ల వరి రైతులు మాత్రమే నష్టపోయారని, మంగళవారం రాత్రి తుఫాను తీరం దాటే సమయంలో 70–80 కిమీ వేగంతో గాలులు వీచి వర్షం పడడంతో అరటి, మినుము, పెసర, పూలతోటలు, 70 శాతం నుంచి 100 శాతం వరకు దెబ్బతిన్నాయని చెప్పారు. అరటి గెలలు మరో నెల రోజుల్లో చేతికి వచ్చే పరిస్థితుల్లో ఉన్నాయి. ఇలాంటి సమయంలో రైతులకు నష్టం కలగడం చాలా బాధాకరమన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జరిగిన నష్టంపై విచారణ వ్యక్తం చేస్తున్నారని, పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు రైతులకు ధైర్యం చెబుతూ పంట పొలాలను పరిశీలిస్తున్నామని అన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతుభరోసా కేంద్రాల నుంచి వ్యవసాయ శాఖ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది సంయుక్తంగా నష్టపోయిన పంట వివరాలను సేకరిస్తున్నారని చెప్పారు. ఎంటీఎంసీ పరిధిలో 15 వేల ఎకరాల్లో వాణిజ్య పంటలతో పాటు వరి పంటను పండిస్తున్నారని, ఎంతమేర నష్టపోయారనే విషయాన్ని రైతుల దగ్గర నుంచి వ్యవసాయ శాఖ వివరాలు సేకరిస్తోంది. జరిగిన ఈ నష్టంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, వ్యవసాయ శాఖమంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డిల దృష్టికి తీసుకువెళ్లి మెరుగైన నష్టపరిహారం అందించేవిధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ఆర్కే స్పష్టం చేశారు.

రామచంద్రాపురంలో పర్యటన

మంగళగిరి: మంగళవారం నుంచే ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులు నష్ట అంచనాలు సిద్ధం చేస్తున్నారని పేర్కొన్నారు. అరటి పంటకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద ఎకరాకు రూ.పది వేలు, వరికి రూ.6 వేలు, మినుముకి రూ.4 వేలు సబ్సిడీ ఇచ్చేందుకు ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించిందని వెల్లడించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు గాయం శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీ శైలజ పాల్గొన్నారు.

కొండవీటి వాగు ముంపుతో ఆందోళనలో అన్నదాతలు,

తాడికొండ: మిచాంగ్ తుఫాన్‌తో రైతులు కష్టాలు ఎదుర్కొంటున్నారు. కొండవీటి వాగుకు వరద పోటెత్తడంతో తాడికొండ, తుళ్లూరు మండలాల్లోని వేలాది ఎకరాల్లో వరి, జొన్న, శనగ, మినుము, కంది, మిర్చి, పత్తి పంటలు నీటమునిగి తీరని నష్టం వాటిల్లింది. ఓదెలపై ఉన్న వరి, కంకి దశకు వచ్చిన జొన్న నేలకూలడంతో లబోదిబో మంటున్నారు. మినుము, శనగ పైరు పూర్తిగా నీట మునగడంతో కాయకుళ్లిపోయి దున్ని వేయాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.



తాడికొండలో నీట మునిగిన శనగ పైరు

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం



పంటపొలాలను పరిశీలిస్తున్న కత్తెర సురేష్‌కుమార్

మేడికొండూరు: మిచాంగ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో నీట మునిగిన పంట పొలాలను బుధవారం పరిశీలించారు. మేడికొండూరు మండలంలోని వరగాని గ్రామంలో నీట మునిగిన వరి పొలాలను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దారు శ్రీనివాసశర్మ, ఎంపీడీఓ ప్రభాకరరావు, ఏఓ నాగరాజు, వైస్ ఎంపీపీ రాజశేఖరరెడ్డి, వరగాని సర్పంచి యలమందారెడ్డి పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత



సరుకులు అందజేస్తున్న తహసీల్దార్ నాగిరెడ్డి, నగర డెప్యూటీ కమిషనర్ శివారెడ్డి

తాడేపల్లిరూరల్: తుఫాన్ కారణంగా నిరాశ్రయులైన వారికి ప్రభుత్వం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా తాడేపల్లి తహసీల్దార్ నాగిరెడ్డి, ఎంటీఎంసీ డెప్యూటీ కమిషనర్ శివారెడ్డి మాట్లాడుతూ తాడేపల్లి పట్టణ పరిధిలోని సాయిబాబా గుడి సమీపంలో రోడ్డు వెంబడి గంగిరెద్దులు ఆడించుకునే 36 కుటుంబాలను పునరావాస కేంద్రానికి తరలించి అల్పాహారంతో పాటు భోజన సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల రెడ్డి, జాయింట్ కలెక్టర్ రాజకుమారి ఆదేశాల మేరకు బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు 25 కేజీల బియ్యం, కిలో కందిపప్పు, కేజీ పామాయిల్, కేజీ బంగాళ దుంపలు, కేజీ ఉల్లిపాయలు అందజేసినట్లు చెప్పారు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఒక్కొక్క కుటుంబానికి తమ సొంత డబ్బులతో రెండు దుప్పట్లను అందించారు. కార్యక్రమాల్లో తాడేపల్లి మండల స్పెషల్ అధికారి మహబూబ్ బాషా, జిల్లా పౌరశాఖ మేనేజర్ గిడ్డి లక్ష్మి, ఆర్ఐ వంశీకృష్ణ, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు ముదిగొండ ప్రకాష్ పాల్గొన్నారు.

బాబా సాహెబ్ అంబేడ్కర్‌కు ఘన నివాళి



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు



తాడేపల్లిలో అంబేడ్కర్, ఏకలవ్య విగ్రహాలకు పూలమాలలు వేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మంగళగిరి: డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) కోరారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంతో అంబేడ్కర్ వర్ధంతి బుధవారం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచ దేశాలలోనే భారతదేశానికి రూపురేఖలు ప్రజాస్వామ్యానికి వన్నె తీసుకువచ్చిన మహనీయుడు అంబేడ్కర్ కొనియాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడ నగరం నడిబొడ్డున అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారని, త్వరలోనే ప్రారంభించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గంజి చిరంజీవి, జిల్లా, అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ కన్వీనర్ ఆకురాతి రాజేష్, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్, మున్నంగి వివేకానందరెడ్డి, మాజీ కౌన్సిలర్లు ఎస్.సునీత, కె.స్వరూపారాణి, బి.రాజాజీ, ఎం.సుధారాణి, నాయకులు ఈ.ఆదాం, డి.వీరయ్య, కె.ఆదాం, ఎస్.ప్రశాంత్, వైఎస్ అంజి, మలక్ బాబు, కె.కృష్ణ కిషోర్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ రైట్స్ యాక్ట్స్ కార్యాలయంలో..

పట్టణంలోని పార్కు రోడ్డులోని ఎస్సీ ఎస్టీ రైట్స్ యాక్ట్స్ కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వి.గోవిందరాజు, పాస్టరు ఉప్పు స్టీఫన్, ఎం.మిల్కీ పాల్గొన్నారు. నగరంలోని పోస్టాఫీసు కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. పోస్టుమాస్టర్ ఎం.నరసింహారెడ్డి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పోస్టల్ అధికారులు పీఎం పుష్పలీల, కోటిరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

తాడేపల్లిరూరల్: డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ వర్ధంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంటీఎంసీ కార్యాలయం వద్ద ఉన్న డాక్టర్ అంబేడ్కర్, ఏకలవ్య విగ్రహాలకు వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం నిరంతరం పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ముదిగొండ ప్రకాష్, సోషల్ మీడియా అధ్యక్షులు వెంకటరామిరెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షులు మేడా వెంకటేశ్వరరావు (పండు), ఎస్టీ, బీసీ, మైనార్టీ విభాగాల అధ్యక్షుడు బాలసాని అనిల్, బత్తుల దాసు, సయ్యద్ రసూల్, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి చిలుకోటి శ్రీనివాస మధు, నాయకులు సింహాద్రి, గోపి, కురుగంటి ఉదయరాజు, అశోక్, నరేష్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనే మన లక్ష్యం

తాడేపల్లిరూరల్: రాజ్యాంగ రచయిత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయన సాధనే మనందరి లక్ష్యమని దుగ్గిరాల ఎంపీపీ డి.సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు ఎం.అరుణ అన్నారు. బుధవారం దుగ్గిరాల మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో యార్డు చైర్మన్ షేక్ బాజీ, ఈఓపీఆర్డీ ఎస్.రత్నం, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు డి.వెంకటేశ్వరరావు, నాయకులు వి.రజనీకాంత్, ఎన్. ఏసుపాదం, షేక్ మహబూబ్ సుభాని, ఉప్పాల ఆనంద్‌బాబు పాల్గొన్నారు. అనంతరం దుగ్గిరాల పోలీస్‌స్టేషన్ సమీపంలో వున్న అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దుగ్గిరాల మండల పరిధిలోని ఈమనిలో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. ఎంపీపీ డి.సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు ఎం.అరుణ పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ డి.వీరయ్య, డి.వెంకటేశ్వరరావు , ఈమని పీఏసీఎస్ అధ్యక్షులు ఎన్.ఏసుపాదం, వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ మహబూబ్ సుభాని, పిల్లి ధర్మరత్నం, జె.లోకేష్, కాంతారావు పాల్గొన్నారు.



దుగ్గిరాల మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళి



బడేపురంలో అంబేడ్కర్ విగ్రహం నివాళులర్పిస్తున్న సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

తాడికొండ: అంబేడ్కర్ కలలుగన్న ఆశయాల సాధనకు కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో కుల మతాలు, పార్టీలు, ప్రాంతాలకు అతీతంగా అందరికీ సమన్యాయం జరుగుతుందని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకొని తాడికొండ శివారు బడేపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బెజ్జం సాయిప్రసాద్ ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు గుడిమెట్ల జ్యోతి, కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ షేక్ నగీనా, మాజీ చైర్మన్ వంగా పోలారెడ్డి, వైస్ ఎంపీపీ రెడ్డి త్రివేణి, పార్టీ మండల అధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ కొమ్మినేని రామచంద్రరావు, ముఖ్య నాయకులు తాళ్ళ శివనాగరాజు, కొమ్మినేని పున్నారావు, రజక సంఘం అధ్యక్షుడు కలుగూరి నాగరాజు, నిడుముక్కల, పాములపాడు సర్పంచులు మాదాసు రత్నకుమారి, బిక్కి శివరామకృష్ణ, దామరపల్లి మాజీ సర్పంచి నల్లిబోయిన శ్రీనివాసరావు, ఎంపీటీసీలు పాలడుగు దాసు, ధూళిపాళ్ళ నాగేశ్వరరావు పాల్గొన్నారు. తాడికొండ ఎంపీడీవో కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ప్రత్యేకాధికారి, పరిశ్రమల శాఖ డీడీ సుధాకర్, ఎంపీడీఓ అత్తోట దీప్తి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తుళ్ళూరు లైబ్రరీ కూడలి, పెదపరిమి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంటర్లో నిర్వహించిన అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు కె.శేషగిరిరావు, ఎస్.సందీప్ పాల్గొని అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అంబేడ్కర్ ఘన నివాళి

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, ఎంపీపీ షేక్ షహేలా నర్గీస్ , పార్టీ అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, వైస్ ఎంపీపీ జి.చంద్రం, పి.జేమ్స్ ఇన్నయ్య, చిట్టా అంజిరెడ్డి, మెల్కియా, కె.చిన్నప్పరెడ్డి, బాపూజీరెడ్డి, పి.రఘు, సలీం, డేవిడ్, కె.రామారావు, ఎస్.నాగరాజు, ఇజ్రాయిల్, సంజీవరెడ్డి, అప్పిరెడ్డి, చౌడయ్య, ఖాజావలి, మస్తాన్‌వలి, రంజన్‌బాబు, బి.అంజిరెడ్డి, టి.కృష్ణ, హేమలతారెడ్డి పాల్గొన్నారు.

తక్షణమే నీటిని తరలించేందుకు చర్యలు

జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి



నీటి మునిగిన పంటను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు

తాడేపల్లిరూరల్: తుఫాన్ కారణంగా పంటపొలాల్లో నిలిచిపోయిన వర్షపు నీటిని తరలించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, వర్షపు నీటిని పంటపొలాల్లోంచి బయటకు తరలించేందుకు ఎంత ఖర్చు అయినా వెనుకాడవద్దని కలెక్టర్ ఎం. వేణుగోపాల రెడ్డి అన్నారు. బుధవారం గుంటూరు జిల్లాలోని దుగ్గిరాల మండలంలోని పలు గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. నీట మునిగిన వరి పొలాన్ని, నేలకొరిగిన అరటి తోటలను, పాడైపోయిన మినుము పంటను వివిధ శాఖల అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ మిచాంగ్ తుఫాన్ కారణంగా గుంటూరు జిల్లాలో అపారమైన నష్టం జరిగిందని, 36 గంటల వ్యవధిలో తెనాలి, మంగళగిరి, పొన్నూరు నియోజకవర్గాల్లో 150 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, మరికొన్ని చోట్ల 200 మి.మీ. నమోదు అయ్యిందని, పంటపొలాల్లో నిలిచిపోయిన వర్షపు నీటిని బయటకు తరలించేందుకు స్థానికంగా ఉన్న పరిస్థితులను రెవెన్యూ, ఇరిగేషన్, డ్రైనేజీ ఇరిగేషన్ వారు సంయుక్తంగా పరిశీలించి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటికే తుఫాన్ ప్రభావంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా కలెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారని, నష్టపరిహారాన్ని అంచనా వేయాలంటే ముందుగా పంటపొలాల్లో నీటిని బయటకు తరలించాలని, నేటి నుండి వ్యవసాయ శాఖ అధికారులు నష్టపోయిన పంట పొలాల నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని అన్నారు. ఆయన వెంట దుగ్గిరాల తహసీల్దార్ మల్లేశ్వరి, ఇరిగేషన్ ఏఈ వనిత, వ్యవసాయ శాఖ అధికారి శిరీష, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, పాల్గొన్నారు.

నవరత్నాలతో ప్రజల జీవితాలలో వెలుగులు

- వైఎస్సార్ సీపీ నాయకుడు గంజి చిరంజీవి
- 11వ వార్డులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం



సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మంగళగిరి: నవరత్నాల పథకాల ద్వారా ప్రజల జీవితాలలో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రజల అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గంజి చిరంజీవి పేర్కొన్నారు. పట్టణంలో 11వ వార్డు సచివాలయ పరిధి(కొప్పురావు కాలనీ)లో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ ఆకురాతి రాజేష్ ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరించారు అనంతరం వార్డు ప్రజలతో సమావేశం నిర్వహించి వార్డులో పార్టీ జెండాను ఎగురవేసి ఇంటింటికి తిరిగి లబ్ధిదారులకు అందిన సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. సమావేశంలో చిరంజీవి మాట్లాడుతూ ఒక్క 19వ వార్డు ప్రభుత్వం అందించిన పథకాల ద్వారా రూ.19 కోట్లకుపైగా నగదు అందుకున్నారంటే పథకాలు ఇళ్ల వద్దకే ఎలా వస్తున్నాయో ప్రజలు గ్రహించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించి అర్హులైన చివర లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు అందించేందుకే వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ సూపరింటెండెంట్ పి.శ్రీనివాసరావు, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్, పార్టీ నాయకులు వెంకటరంగం, వి.శంకరరావు, ఎం.సాంబయ్య, శ్రీనివాసరావు, ఎం.సుధారాణి, సాలి ప్రశాంత్, కె.రాజేష్, మలక్‌బాబు పాల్గొన్నారు.

ఆరు నెలల్లో పెదకోనేరుకు పూర్వవైభవం

ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి: నగరంలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి కళ్యాణ పుష్కరణి(పెదకోనేరు)కు ఆరు నెలల్లో పూర్తిస్థాయిలో అభివృద్ధి పరచి పునర్వైభవం తీసుకువచ్చేలా పనులు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) తెలిపారు. నగరంలోని ఆటోనగర్‌లోని ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో బుధవారం మాట్లాడారు. 500 సంవత్సరాల క్రిందట నిర్మించి స్వామి వారి ఉత్సవాలకు, అభిషేకాలకు, తెప్పోత్సవాలతో పాటు నగర ప్రజల దాహార్తి తీర్చేలా భూగర్భజలాలు తగ్గకుండా పెద కోనేరు నిర్మించడం జరిగిందన్నారు. కాలక్రమేణా కోనేరు శిథిలావస్థకు చేరడంతో నిరుపయోగంగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో కోనేరులోని నీటిని తొలగించి పూర్తి స్థాయిలో అభివృద్ధి పరచేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. రూ 1.50 కోట్లతో చేపట్టిన పనులు శరవేగంగా జరుగుతున్నాయని వివరించారు. కోనేరులోని ఆంజనేయ స్వామి ఆలయంతో పాటు మెట్లపై ఉన్న శివలింగాలకు పూర్తి స్థాయిలో భక్తుల పూజలందుకునేలా నిర్మాణం చేస్తున్నట్లు పేర్కొన్నారు. పిడుగులు పడడంతో మెట్లు పూర్తిగా దెబ్బతినగా మెట్లను పునర్నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. 150 అడుగుల పూడిక తీసి పూర్తి స్థాయిలో సాంకేతికతను వినియోగించి అనుభవజ్ఞులైన నిపుణుల సహకారంతో నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికే సుమారు 25శాతానికిపైగా పనులు పూర్తయ్యాయని మిగిలిన పనులు ఆరునెలల్లో పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తేవడంతో స్వామి వారికి కోనేరు నుంచి అన్ని సేవలందేలా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

రత్నాలచెరువు, ఎస్టీ కాలనీలను పరిశీలించిన కమిషనర్



మంగళగిరి: నగరంలోని శివారు ప్రాంతాలను కార్పొరేషన్ కమిషనర్ నిర్మల్ కుమార్, అడిషనల్ కమిషనర్ కె.హేమమాలిని బుధవారం పరిశీలించారు. తుఫాన్ కారణంగా రెండు రోజులుగా భారీ వర్షం కురిసిన నేపథ్యంలో శివారు ప్రాంతాలను పరిశీలించి వర్షం ఎక్కువై ఇళ్లల్లోకి నీరు వస్తే వెంటనే పునరావాస శిబిరాలకు తరలించి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు అన్ని వసతులు సిద్ధం చేయడం జరిగిందన్నారు. నగర శివారు కాలనీలు రత్నాలచెరువు, ఎస్టీ కాలనీ, నవులూరు ఎస్టీ కాలనీ, పావురాల కాలనీలను పరిశీలించినట్లు వివరించారు. ప్రజలు ఇబ్బంది పడకుండా ఏదైనా ఇబ్బంది కలిగితే తక్షణ సమాచారం అందించేందుకు ప్రత్యేక అధికారిని నియమించినట్లు చెప్పారు. ఎంటీఎంసీలో వర్షాల కారణంగా ప్రజలకు ఇబ్బంది ఉంటే 8977011901కు సమాచారమివ్వాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో బీ ఫార్మసీ విద్యార్థిని మృతి

తాడేపల్లిరూరల్: కృష్ణానది కనకదుర్గ వారధిపై బుధవారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో బీ ఫార్మసీ మూడో ఏడాది విద్యార్థిని అక్కడికక్కడే మృతి చెందింది. ఎస్ఐ గిరిబాబు తెలిపిన వివరాలు.. ప్రకారం పట్టణ పరిధిలోని మహానాడు 13వ లైన్‌లో నివాసముండే రాంబాబు కుమార్తె బొప్పన కుసుమ ప్రియ(22) విజయవాడలోని ఓ ప్రైవేటు కళాశాలలో బి.ఫార్మసీ చదువుతోంది. తన తమ్ముడు ఆదిత్య వెంకటసాయితో కలసి మధ్యాహ్నం విజయవాడ కళాశాలకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా వారధి మధ్యలో ఓ గుర్తుతెలియని వాహనం తగలడంతో రోడ్డుపై పడ్డారు. వెనక నుంచి వస్తున్న లారీ రోడ్డుపై పడిన కుసుమప్రియ మీద నుంచి వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె తమ్ముడు ఆదిత్య వెంకట సాయికి స్వల్ప గాయాలు అయ్యాయి. ఆదిత్య వెంకట సాయికి 108లో వైద్యశాలకు తరలించారు. కుసుమ ప్రియ తండ్రి రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

2,136 హెక్టార్లలో పంట నష్టం

తాడికొండ: మిచాంగ్ తుఫాన్ ధాటికి మండలంలో 2,136 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనాలు రూపొందించినట్లు మండల వ్యవసాయాధికారి పి.నరసింహారావు తెలిపారు. వరద ఉధృతి తగ్గిన వెంటనే తమ సిబ్బంది మండలంలోని అన్ని పంట పొలాలను పరిశీలించి పూర్తి స్థాయి వరద నివేదికను రూపొందించి ప్రభుత్వానికి అందజేస్తామన్నారు.